క్లుప్తంగా

దాడి ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: దాడి ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన కథనం మేరకు... మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన వరాబత్తిన దినేష్‌కుమార్‌ను ఈనెల 18న అతని స్నేహితుడు గజ్జలకొండ సాయి మద్యం తాగేందుకు రమ్మని పిలిచాడు. అయితే దినేష్ అందుకు నిరాకరించడంతో ఉయ్యూరు నుంచి బైక్‌పై వస్తున్న దినేష్‌కుమార్‌ను దావులూరు టోల్‌గేట్ వద్ద సాయి, ఈశ్వర్, మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ ఆపి అసభ్యకరంగా దూషించి, దాడి చేశారు. ఈనెల 19న దినేష్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం చేర్చి, మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు గైడ్ సాయం

పెనమలూరు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ తదితర వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదలకు గైడ్ స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమం నిర్వహించింది. పోరంకిలో శుక్రవారం పులి రాఘవేంద్రరావు, లలితకుమారి సహకారంతో రోగులకు రాగిపిండి, బెల్లం, శెనగలు, పండ్లు, చీరలు పంపిణీ చేశారు. మొత్తం 23 మంది రోగులకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గైడ్ ప్రతినిధులు టి.రాంబాబు, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: విద్యార్థిని అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి కథనం మేరకు... మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని (19) ఇంటర్ పూర్తి చేసి విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈనెల 19న నాయనమ్మ ఇంటికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసింది. సాయంత్రం 5 గంటల సమయంలో కుటుంబసభ్యులు కుమార్తె గురించి ఆరా తీయగా, నాయనమ్మ తన వద్దకు మనవరాలు రాలేదని చెప్పటంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యార్థిని అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల కృషి



గన్నవరంరూరల్: మాదలవారిగూడెంలో చదువుకు దూరమైన ఇద్దరిని గుర్తించి చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ సంస్థ వారితో ఇంటర్మీడియట్ పూర్తి చేయించింది. సర్పంచ్ బుద్ధాల లక్ష్మీ ప్రసన్న శుక్రవారం శివారు గ్రామం చనుపల్లివారిగూడెంకు చెందిన బెజవాడ వినయ్ కుమార్, బడిపాటి హెప్సిరాణిలకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని సచివాలయం కార్యదర్శి కేవీ రాజశేఖర్, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రామ్‌నాయక్, ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.ప్రమోద్ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి

రామవరప్పాడు: గత టీడీపీ ప్రభుత్వంలో అన్యాక్రాంతానికి గురైన వక్ఫ్‌బోర్డు ఆస్తులు గుర్తించి పరిరక్షించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం రైట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ నూరుద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని ముస్లిం రైట్స్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నూరుద్దీన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వక్ఫ్ బోర్డులో ఉన్న మాజీ డైరెక్టర్ షేక్ ఖాజా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఇతడ్ని బోర్డులో తిరిగి నియమించే ప్రయత్నాలు జరుగుతుండటం బాధకరమన్నారు. ముస్లింల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిను త్వరలో కలిసి మైనార్టీల సమస్యలు, ఆస్తుల పరిరక్షణ అంశంపై వినతి పత్రం సమర్పించనున్నట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ మహమ్మద్ ఇంతియాజ్, షేక్ మస్తాన్, సభ్యులు షేక్ షరీఫ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు7న ఓబీసీ 8వ జాతీయ మహాసభలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓబీసీ 8వ జాతీయ మహాసభలు ఆగస్టు 7న తిరుపతిలోని తారక రామ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కె.ఆల్‌మెన్ రాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆల్‌మెన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గ్రామ సచివాలయాలతో నవశకానికి నాంది



బందారుగూడెంలో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు



బాపులపాడు-3 గ్రామ సచివాలయం

బాపులపాడు మండలంలో..	
సచివాలయాల సంఖ్య:	22
అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధిదారులు:	53,272 మంది
వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు:	11,633 మంది
ఏటా వైఎస్సార్ పింఛన్‌తో పొందుతున్న లబ్ధి:	రూ.3.19 కోట్లు
వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు:	5,416
ఏటా ఈ పథకం ద్వారా పొందుతున్న లబ్ధి:	రూ.10.15 కోట్లు
వైఎస్సార్ కాపు నేస్తం లబ్ధిదారుల సంఖ్య:	656
ఏటా ఈ పథకం ద్వారా పొందుతున్న లబ్ధి:	రూ.98.40 లక్షలు
ఈబీసీ నేస్తం పథకం లబ్ధిదారులు:	780
ఏటా ఈబీసీ నేస్తం పథకం ద్వారా పొందుతున్న లబ్ధి:	రూ. 1.17 కోట్లు
జగనన్న అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య:	6,838
ఏటా ఈ పథకం ద్వారా పొందుతున్న లబ్ధి:	రూ. 10.25 కోట్లు
జగనన్న విద్యాదీవెన లబ్ధిదారులు:	1,853
ఏటా జగనన్న విద్యాదీవెనతో పొందుతున్న లబ్ధి:	రూ.3.15 కోట్లు
జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులు:	284 మంది
ఏటా జగనన్న చేదోడు ద్వారా లబ్ధి:	రూ. 28.40 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారుల సంఖ్య:	624
ఏటా వైఎస్సార్ వాహన మిత్రతో లబ్ధి:	రూ. 62.40 లక్షలు
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు:	17,477
ఏటా వైఎస్సార్ ఆసరా ద్వారా పొందుతున్న లబ్ధి:	రూ.16.67 కోట్లు

- ప్రజలకు ఇళ్ల ముంగిటకే పాలన
- లబ్ధిదారులకు సత్వర సేవలు
- బాపులపాడులో 53,272 మంది లబ్ధిదారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవశకానికి నాంది పలికారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ సుపరిపాలన, అధికార వికేంద్రీకరణతో పాటుగా ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ప్రజలకు సత్వర సేవలు

ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిలో ప్రజలకు సత్వర సేవలు అందించడానికి పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశు సంవర్ధక అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, లైన్‌మెన్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, గ్రామ సర్వేయర్ ఉద్యోగులతో పాటుగా అవసరమైన చోట్ల విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. గ్రామ సచివాలయాల్లో ఈ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయటంతో పాటుగా రకరకాల పౌరసేవలను అందిస్తున్నారు. మొత్తం 300 పైగా వివిధ శాఖల పౌర సేవలను గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ప్రజలు దరఖాస్తు చేసిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి దరఖాస్తుదారునికి తెలియజేయాల్సి ఉంది. గ్రామ సచివాలయాల్లో సమస్యలు, అధికారులతో ఇబ్బందులపై 1902 కాల్‌సెంటర్ ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేసేందుకు వీలు కల్పించారు.

ధీమాగా బతుకుతున్నాం



జగనన్న ప్రభుత్వంలో ఎంతో ధీమాగా బతుకుతున్నాం. మాకు ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే వలంటీర్ ఇంటికి వచ్చి ఫించన్ అందిస్తున్నారు. వృద్ధాప్యంలో బతుకు భారం కాకుండా ఆనందంగా జీవిస్తున్నాం. గ్రామ సచివాలయం, వలంటీర్ల ద్వారా వృద్ధులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆసరా కల్పించారు.

– షేక్ ఆషరిఫున్నీసా, మహాత్మాగాంధీనగర్

చేయూతతో కొండంత అండ



ఏ అవసరం వచ్చినా మాకు టక్కున గుర్తుకు వచ్చేది వలంటీర్లు, గ్రామ సచివాలయం ఉద్యోగులే. నిత్యం మాకు అందుబాటులో ఉంటూ చక్కగా సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,500 నా బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. వీటితో నేను చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాను.

–చిక్కా లక్ష్మీ తులసి, బాపులపాడు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులకు వృద్ధాప్యం నరకమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత పింఛన్ పెంచటంతో పాటుగా ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీరు నేరుగా ఇంటికి వచ్చి ఎంతో సంతోషంగా మాకు డబ్బులు చేతిలో పెట్టి వెళుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– సీహెచ్ వెంకటేశ్వరరావు, బాపులపాడు

ఇంటి వద్దకే పాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్లు, గ్రామ సచివాలయం వ్యవస్థలతో ప్రభుత్వం ఇంటి వద్దకు వచ్చినట్లైంది. ప్రతి ప్రభుత్వ పథకాన్ని, సేవలను నేరుగా ఇంటికే తీసుకువచ్చి అందిస్తున్నారు. నేను వితంతు పింఛన్‌తో పాటుగా ఈబీసీ నేస్తం కింద లబ్ధి పొందుతున్నాను.

–నాదెళ్ల నర్సకుమారి, బాపులపాడు-3

సాంకేతిక విజ్ఞాన ప్రగతిపై అవగాహన



ఉంగుటూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు మారుతున్న కాలానుకునుగుణంగా సాంకేతిక విజ్ఞాన ప్రగతిపై అవగాహన పెంపొందించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన బ్రెయినోవిజన్ వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ డి.గణేష్‌నాగ్ అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతికత అప్‌డేట్, అప్‌గ్రేడ్‌పై మూడు రోజులపాటు జరిగిన వర్కషాపు శుక్రవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ మానవ మేధస్సుతోనే విజ్ఞానం, ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఏఎస్‌డబ్ల్యూ క్లౌడ్ అభివృద్ధిలో జరిగిన మూడు రోజుల వర్కషాప్‌లో పలు సర్వర్ల వినియోగం, రిసోర్స్ సాఫ్ట్‌వేర్ వర్క్‌లోడ్, బ్యాలెన్సింగ్ ఖర్చు అంచనా, రిసోర్స్ మెయింటినెన్స్, భద్రత సమస్యలు ఎలా నిర్వహించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సాంకేతికత, విజ్ఞాన అంశాల సహకారం అందించడానికి బ్రెయినోవిజన్ వారి సహకారం అందుకోవడం కోసం ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల పరస్పర అంగీకారం(ఎంఓయూ) కుదుర్చుకున్నారు. వర్క్‌షాపులో వివిధ విభాగాల నుంచి 400మంది విద్యార్థులు శిక్షణ పొందారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖర్, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఆడుకుందాం ఆంధ్రపై సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సత్యకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రేడ్-1, గ్రేడ్-5 కార్యదర్శులు,వ్యాయామోపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు.

నేస్తం.. నేతన్నకు ఊతం

- చేనేతల కష్టాలు గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే
- నేతన్న నేస్తం జిల్లా స్థాయి కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్
- పాల్గొన్న వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, కలెక్టర్ రాజాబాబు తదితరులు



నేత కార్మికులకు చెక్కును అందిస్తున్న మంత్రి జోగి రమేష్, కలెక్టర్ రాజాబాబు, కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి తదితరులు

గూడూరు(పెడన): రెక్కాడితే గానీ డొక్క నిండని చేనేత కార్మికులు కష్టాలు గుర్తించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదలను పురస్కరించుకుని గూడూరు సమీపంలోని సుమా కన్వెన్షన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఘనత మన ముఖ్యమంత్రిదే..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం మల్లన్నకు తలపాగా సమర్పించే ఘనత పెడన చేనేత కార్మికులదని మంత్రి జోగి రమేష్ కొనియాడారు. అలాంటి పవిత్ర నైపుణ్యం కలిగిన చేనేత కార్మికుల కష్టాలను కళ్లారా చూసిన జగనన్న మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు ఇస్తానని సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా నేతన్నల ఖాతాల్లో నేరుగా నిధులు జమచేస్తూ వచ్చారన్నారు. ఐదు సంవత్సరాలు పూర్తికాకముందే నేడు ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులను విడుదల చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ఏడాది ఆగస్టు 25న పెడన వచ్చిన జగనన్న నాలుగో విడత నిధులు విడుదల చేయగా 11 నెలల వ్యవధిలోనే ఐదో విడత నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందంటే చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో గమనించాలన్నారు. ఇప్పటి వరకు మగ్గం ఉన్న ఒక్కో నేత కార్మికుడికి ఏడాదికి రూ.24వేల చొప్పున రూ.1.20లక్షలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. కృష్ణా జిల్లాలో 4,386 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10,52,64,000 జమ అయ్యాయన్నారు.

విప్లవాత్మక మార్పు..

కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ గడచిన నాలుగేళ్ల కాలంలో విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో ఎంతో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉండి మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగి రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, పెడన మున్సిపల్ చైర్మన్ కటకం నాగకుమారి, పెడన ఏఎంసీ చైర్మన్ గరికపాటి చారుమతి, గూడూరు ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల కృష్ణ, ఆర్బీకే చైర్మన్ పర్లం పెదబాబు, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కామేశ్వరరావు, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఈడుపుగల్లులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు



తాడిగడపలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు

కంకిపాడు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు-2, కంకిపాడు-2 సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈడుపుగల్లు-2లో 636 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ బూరగ బాలాజీ, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, అగ్రిబోర్డు డైరెక్టర్ నకిరికంటి శేఖర్, నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా, సచివాలయ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు-2 సచివాలయంలో నిర్వహించిన సభలో 973 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష–ప్రజలకు రక్ష

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షగా ఉందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. తాడిగడప కార్మికనగర్ సచివాలయం 2లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 664 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నర్రా చంటి, కటికల క్రిస్టోఫర్, శ్రీకాంత్‌రెడ్డి, పి.సాంబయ్య, వెలిశిల ప్రసాద్, లక్ష్మి, వరప్రసాద్, ఖాదర్‌బాషా, జైకర్, కిషోర్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గన్నవరంరూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎంపీపీ అనగాని రవి కోరారు. సావరగూడెంలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. సావరగూడెం గ్రామంలో 200 సర్టిఫికెట్లు గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సత్యకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి, మండల స్పెషలాఫీసర్ దుర్గాప్రసాద్,



సావరగూడెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనగాని రవి, జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, సచివాలయం కన్వీనర్ రాచమళ్ల యల్లారావు, పంచాయితీ కార్యదర్శి పి.వి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జా విష్ణువర్ధనరావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. తెంపల్లిలో సర్పంచ్ కొలుసు శిరీష అధ్యక్షతన జరిగిన సురక్ష క్యాంపులో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని గ్రామస్తులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి జీవీ నామేశ్వరరావు, ఆర్ఐ ఉదయ్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఏఎస్సార్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తేలప్రోలు సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 124 మందికి కుల ధ్రువీకరణ, 111మందికి ఆదాయ ధ్రువీకరణ, సీసీఆర్‌సీ కార్డులు 8 పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.సరోజిని, సర్పంచ్ లాం దిబోర, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణ రెడ్డి, ఎంపీటీసీ తియ్యగూర వాణి, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ డి.వనజాక్షి పాల్గొన్నారు.

పెనమలూరులో ఓటర్ల జాబితా తనిఖీ



పెనమలూరులో ఓట్లు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, సిబ్బంది

పెనమలూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెనమలూరు నియోజకవర్గంలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓట్ల తనిఖీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఓటర్ల జాబితా తనిఖీ చేస్తారు. ఇందులో భాగంగా పెనమలూరు మండల తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య శుక్రవారం పెనమలూరు గ్రామంలోని 133వ పోలింగ్ కేంద్రంలో డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేశారు. ఓటర్ల జాబితా తనిఖీ సమర్థంగా చేసే విధంగా బీఎల్‌వోలకు ఆదేశించారు. ఓటర్లు వారికి ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీఎల్‌వోలు కూడా బాధ్యతగా ఓటర్ల జాబితాను ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు రాకుండా చూడాలని హెచ్చరించారు. ఓట్లు చేర్పు మార్పుల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటానన్నారు. ఓటర్ల జాబితా తనిఖీ కార్యక్రమంలో డీటీ భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): ఓటర్ల సమగ్ర సర్వేకు రాజకీయపార్టీలు సహకరించాలని వీఆర్వో చాంద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నున్న గ్రామ సచివాలయం 2లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నున్న వైసీపీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానంద రెడ్డి, పలుపార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. పాతపాడు గ్రామ ం చాయతీ కార్యాలయంలో జరిగిన బూత్‌స్థాయి అధికారుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మరీదు బాల కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి వృద్ధి ద్వారా మహిళల అభ్యున్నతి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్

కంకిపాడు: జీవనోపాధి కల్పన ద్వారా మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్ తెలిపారు. ఫైనాన్సింగ్ ఆఫ్ ఉమెన్–ఎల్‌ఈడీ ఎంటర్‌ప్రైజెస్ శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ తనఖా లేకుండా రుణాలు ఇచ్చేందుకు ఒకప్పుడు బ్యాంకులు అంగీకరించేవికాదన్నారు. కుటుంబ అవసరాలను తీర్చుకోవటానికి సూక్ష్మ రుణ సంస్థలను ఆశ్రయించి వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడ్డ ఘటనలు ఉన్నాయన్నారు. డ్వాక్రా సంఘాలు వచ్చాక రుణాలు సమర్థంగా అందుతున్నాయన్నారు. ప్రస్తుతం రూ.20 లక్షల వరకూ ఒక్కో సంఘానికి రుణం అందుతోందన్నారు. రుణాలను వినియోగించుకుని కుటుంబాలను ప్రగతి పథంలో నడిపించుకునేందుకు మహిళలు కృషి చేస్తున్నారన్నారు. తీసుకున్న రుణాలను జీవనోపాధి కల్పనకు వినియోగించుకుంటే తద్వారా వచ్చే అదనపు ఆదాయం ద్వారా కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఇందుకోసం స్వయం ఉపాధి యూనిట్లను, చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఇందుకు ప్రత్యేక రుణసదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. ఆదాయ మార్గాలను అన్వేషించటం ద్వారా ప్రగతి సాధ్యమవుతుందని వివరించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన మహిళల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం కనకారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, ఏసీ ఇ.రంగారావు, ఏపీఎం సాంబశివరావు, కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.